జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
బుధవారం సెప్టెంబర్ 16, 2026 పేజీలు:15



02లో

## ఊరురా
## గణపయ్య ల హోరు
## హుషారు తో భక్తుల జోరు




- "హామీలు కొండంత..
అమలు శూన్యం!"
- కాంగ్రెస్ సర్కారుపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఫైర్.. బీఆర్ఎస్ హయాంలో గిరిజన అభివృద్ధిని వివరించిన మాజీ మంత్రి

02లో

# "గిరిజనులకిచ్చిన
# హామీలెక్కడ..?

# “గిరిజనులకిచ్చిన హామీలెక్కడ..?

మొదటిపేజీ తరువాయి

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 15 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసిందని మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు ఎన్నికల హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గిరిజనులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీల అమలుపై తీవ్ర విమర్శలు చేశారు.

**10 శాతం రిజర్వేషన్ హామీ అమలుపై ప్రశ్న**

అంబేద్కర్ అభయహస్తం పథకం ద్వారా ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షలు అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అమలు చేయలేదని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్, కాంట్రాక్టుల్లో ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం వెనక్కి తగ్గిందని, గిరిజన విద్యార్థులకు ‘విద్యా జ్యోతి’ పథకం ద్వారా రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు విద్యా ప్రోత్సాహకం అందిస్తామని చెప్పినా ఆ హామీని విస్మరించిందని అన్నారు.

**కేసీఆర్ హయాంలో గిరిజనులకు ప్రాధాన్యం:**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజనుల జనాభాకు అనుగుణంగా ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. 3,146 తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించి సుమారు 30 వేల మంది గిరిజనులకు ప్రజాప్రతినిధులుగా ఎదిగే అవకాశం కల్పించామని చెప్పారు. హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ బంజారా భవన్, కొమురం భీం ఆదివాసీ భవన్ నిర్మించామని, గిరిజనుల కోసం సుమారు రూ.100 కోట్ల ఆస్తులు, రూ.25 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. తండాలకు విద్యుత్, ఇంటింటికీ తాగునీరు అందించడంతో పాటు గురుకులాలు, వసతి గృహాల్లో విద్య, వసతి, భోజన సౌకర్యాలను మెరుగుపరిచామని పేర్కొన్నారు.

**పాలమూరులో గిరిజనుల కోసం పలు నిర్మాణాలు**

మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎదిరలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.2.75 కోట్లతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఏర్పాటు చేశామని తెలిపారు. స్టేడియం గ్రౌండ్స్ సమీపంలో కళాశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థినుల కోసం రూ.1.70 కోట్లతో ప్రభుత్వ గిరిజన కళాశాల వసతి గృహాన్ని నిర్మించి ప్రారంభించామని చెప్పారు. పద్మావతి కాలనీ అయ్యప్పకొండపై 2 వేల గజాల స్థలంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.1.10 కోట్లతో గిరిజన భవన్ నిర్మాణాన్ని పూర్తి చేశామని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులు, వర్కింగ్ మహిళల కోసం సుమారు రూ.4 కోట్లతో అన్ని వసతులతో భవన నిర్మాణాలు చేపట్టామని వివరించారు. గిరిజన యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు వనగట్టు వద్ద రూ.2.75 కోట్లతో ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. హన్వాడ మండలం ఎనిమిది తండాలో సంత్ సేవాలాల్ దేవాలయానికి 500 గజాల స్థలం కేటాయించడంతో పాటు రూ.10 లక్షల నిధులు మంజూరు చేశామని అన్నారు.

**చెంచు కుటుంబాలకు పట్టాలు.. విద్యుత్ సదుపాయం**

హన్వాడ మండలం దాచకపల్లి గ్రామంలో 36 చెంచు కుటుంబాలు దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. 15 ఎకరాల 9 గుంటల పోడు భూమికి పట్టాలు ఇప్పించడంతో పాటు వ్యవసాయానికి విద్యుత్ సదుపాయం కల్పించామని, రైతుబంధు సాయం అందుతోందని చెప్పారు. యారొనిపల్లి వద్ద చెంచు కుటుంబాల కోసం 24 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించామని, నిర్మాణాలు కొంతవరకు పూర్తయిన తరువాత ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతున్న ఆ ఇళ్లను పూర్తి చేసి చెంచు కుటుంబాలకు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో పేద ఎస్టీలకు 167 ఇళ్లను కేటాయించామని తెలిపారు. ఎరుకల సంఘానికి కేటాయించిన భూమిని అప్పగించడంలో అధికారులు ఇబ్బందులు సృష్టిస్తున్నారని, వెంటనే ఆ భూమిని సంఘానికి అప్పగించాలని డిమాండ్ చేశారు.

**గిరిజన కార్పొరేషన్లకు నిధులు ఇవ్వాలి**




గిరిజన కార్పొరేషన్లకు తగినన్ని నిధులు కేటాయించి వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు. గిరిజన గురుకులాలు, వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేషన్ చైర్మన్ వాల్యా నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో గిరిజనులను మోసం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన విద్యార్థులకు విదేశీ విద్యకు కూడా సహకారం అందించామని, ప్రస్తుతం గురుకులాలు, వసతి గృహాల నిర్వహణ సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే అమర్‌రాజా కంపెనీపై గతంలో కాంగ్రెస్ నాయకులు చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ.. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే బీఆర్ఎస్ ప్రభుత్వం కంపెనీ ఏర్పాటుకు సహకరించిందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కనీసం వెయ్యి పడకల ఆస్పత్రిని కూడా ప్రారంభించలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఈ సమావేశంలో సర్పంచుల సంఘం జేఏసీ చైర్మన్ ప్రతాప్ నాయక్, బీఆర్ఎస్ హన్వాడ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరిచందర్, కార్పొరేటర్ రమేష్ నాయక్, సీనియర్ నాయకులు రమేష్ నాయక్, రవీందర్ నాయక్, పూర్య నాయక్, సురేష్ నాయక్, మోహన్ నాయక్, రవి నాయక్, అంబు నాయక్, నెహ్రూ నాయక్, రాజేష్ నాయక్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# ఊరురా గణపయ్యు ల హోరు.....

# హుషారు తో భక్తుల జోరు



**మహమ్మదాబాద్ సెప్టెంబర్ 15(ప్రజా జ్యోతి )**



మహమ్మదాబాద్ మండల వ్యాప్తంగా వినాయక చవితి అంగరంగ వైభవంగా జరిపారు. ఊరు వాడ యువకులు గణేశుని మంటపాలు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సోమవారం వినాయక చవితి సందర్భంగా తెల్లరంగనే లేచి ఇళ్ల ల్ల గణ నాథుడిని ప్రతిష్ఠించుకుని పువ్వు, పత్రీ లతో నైవేద్య ప్రసాదాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మండపాలా దగ్గర యువకులు, చిన్న పిల్లలు మహిళలు పెద్ద ఎత్తున చేరి భక్తి శ్రద్ద ల తో వేడుకలు జరుకున్నారు. మహమ్మదా బాద్ గ్రామ పంచాయతి దగ్గర గల “భగత్ సింగ్ “యూత్ శివాలయం దగ్గర గల “ఫ్రెండ్స్ అసోసియేషన్ “యూత్ వారు వారి మండపాలను చూపరులను ఆకట్టుకునేలా ముస్తాబు చేశారు. ఫ్రెండ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో లో 11కీలో ల లడ్డు తో పాటు తులం వెండి తో తయారు చేసిన వెండి తిలకాన్ని నిమజ్జనం రోజు “డ్రా “లో గెలుపొందిన వారికి అంద జేయనున్నట్లు తెలియ జేశారు. డ్రా లో పాల్గొనడానికి ఆసక్తి గల వారు కమిటీ వారి దగ్గర గల టోకెన్ లు 100 రూపాయలు చెల్లించి కొనాలన్నారు. మండలం లోని నంచర్ల, గాధర్యాల, మంగం పేట్ తదితర గ్రామాల్లో విగ్రహాలను రంగు రంగు ల లైట్ల తో, పూలతో అందంగా అలంకరించారు. డీజే పాటలు, భక్తి గీతాలతో పల్లెలు, గల్లీ లు మార్మోగుతున్నాయి. అడుగడునా “గణపతి బప్పా మోరియా “అంటూ భక్తులు నినాదాలు చేస్తున్నారు.

# విఘ్నేశ్వరుని దర్శించుకున్న యువజన నాయకులు వడ్డేపల్లి అజయ్ కుమార్

**ఆలంపూర్ సెప్టెంబర్ 15(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వడ్డేపల్లి మున్సిపాలిటీ కేంద్రంలోని రామచంద్ర నగర్ మరియు జమ్మలమడుగు కాలనీలలో ప్రతిష్ఠించిన శ్రీ విఘ్నేశ్వరుని మాజీ కౌన్సిలర్ వడ్డేపల్లి అజయ్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరునికి పుష్పాలు సమర్పించి, భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రజలందరికీ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఉండాలని, వడ్డేపల్లి ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. అనంతరం వారు అజయ్ కుమార్ ని సన్మానించారు అదేవిధంగా విగ్రహాల దాత, మాజీ జెడ్పిటిసి, సీనియర్ నాయకులు వడ్డేపల్లి శ్రీనివాసులు ని వారు అభినందించారు. భక్తుల కోసం వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసి, ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పడంలో ఆయన చేసిన కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా వినాయక చవితి పర్వదినం ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావం, సేవా స్ఫూర్తిని పెంపొందించాలని ఆకాంక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పెద్దరెడ్డి, వేణు, రాముడు, శివ, భరత్, రంజిత్, గుండు, కిట్టు, బాబు, రాముడు, గణేష్, రాజేష్, రామాన్జీ, వినాయకుని భక్తబృందం సభ్యులు, స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# భారత్‌మాల హైవేపై ప్రజల ఆగ్రహం!

## సర్వీస్ రోడ్డు.. లింక్ రోడ్డు లేక అవస్థలు

## అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరా?

## నిరసనకు దిగిన రాజోలి మండల ప్రజలు, రైతులు

**ఆలంపూర్ సెప్టెంబర్ 15(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

రాజోలి మండల పరిధిలో వెళ్తున్న భారత్‌మాల నేషనల్ హైవే కారణంగా మండల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. హైవే నిర్మాణం జరుగుతున్నప్పటికీ సర్వీస్ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పాటు, హైవేపైకి ఎక్కడానికి అవసరమైన లింక్ రోడ్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తెలిపారు. ముఖ్యంగా రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు, వ్యవసాయ పనులకు అవసరమైన వాహనాలను తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రధాన రహదారికి చేరుకోవాలన్నా, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాలన్నా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. హైవే నిర్మాణానికి ముందు స్థానిక ప్రజల రాకపోకలు, రైతుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని తగిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమస్యను ఇప్పటికే ఎన్నోసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి పరిష్కారం చూపలేదని ప్రజలు ఆరోపించారు. తమ సమస్యలను పట్టించుకోకపోవడంతోనే సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు. మా డిమాండ్ ఒక్కటే...రాజోలి మండల ప్రజలు, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని భారత్‌మాల హైవేకు అవసరమైన సర్వీస్ రోడ్లు, లింక్ రోడ్లు వెంటనే ఏర్పాటు చేయాలి. ప్రజల సమస్యను అధికారులు తక్షణమే పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. లేకపోతే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



# విఘ్నేశ్వరుని దర్శించుకున్న వడ్డేపల్లి శ్రీనివాసులు, శాంతినగర్ ఎస్సై శేఖర్ రెడ్డి

**ఆలంపూర్ సెప్టెంబర్ 15(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వడ్డేపల్లి మున్సిపాలిటీ కేంద్రంలోని మారుతీ నగర్‌లో ప్రతిష్ఠించిన శ్రీ విఘ్నేశ్వరుని బీసీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు తో కలిసి శాంతినగర్ ఎస్సై శేఖర్ రెడ్డి దర్శించుకుని, గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పుష్పాలు సమర్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి శ్రీనివాసులు ఎస్సై ని సన్మానించారు. వడ్డేపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ, విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ప్రజలందరూ ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ, మాజీ కౌన్సిలర్ వడ్డేపల్లి అజయ్ కుమార్, గంగాధర్, పూర్ణయ్య, రత్తయ్య, వీరేశ్ గౌడ్, స్థానికులు, యువత, వినాయకుని భక్తబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్యే విజయుడు చొరవతో జిల్లేడు దీన్నే గ్రామంలో విద్యుత్ సమస్యకు చెక్!

### 25 కేవీ నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

**ఆలంపూర్ సెప్టెంబర్ 14(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**



జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం వడ్డేపల్లి మండలం జిల్లేడు దీన్నే గ్రామంలో చాలాకాలంగా ఉన్న విద్యుత్ సమస్యకు పరిష్కారంగా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి , ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు ప్రత్యేక చొరవతో 25 కేవీ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.గ్రామంలో విద్యుత్ సరఫరా మెరుగుపడటంతో పాటు లో–వోల్టేజ్ సమస్యలు తగ్గనున్న నేపథ్యంలో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కి, ఎమ్మెల్యే విజయుడు కి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీమతి సువర్ణ వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, లైన్‌మెన్ వినోద్, గజేంద్రరెడ్డి, సత్యరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పేద కుటుంబాలకు అండగా.. వైద్య ఖర్చులకు భరోసాగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

**ఆలంపూర్ సెప్టెంబర్ 15(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 120 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎం.ఆర్.ఎఫ్ ద్వారా మంజూరైన రూ.39,43,000 /- విలువైన చెక్కులను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగాఅనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిస్తోంది. ఈ సహాయాన్ని అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా ఎమ్మెల్యే విజయుడు ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నారు.ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలవడమే ప్రజాప్రతినిధిగా మా బాధ్యత” అనే సంకల్పంతో ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రజల కష్టం తన కష్టంగా భావిస్తూ..ప్రతి కుటుంబానికి భరోసాగా..అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు



# జోగులాంబ గద్వాల జిల్లాలో దళిత క్రైస్తవ హక్కుల పోరాట సమితి ఏర్పాటు

**ఆలంపూర్ సెప్టెంబర్ 15(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లాలో మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు భీమన్న ఆధ్వర్యంలో దళిత క్రైస్తవ హక్కుల పోరాట సమితి సంఘాన్ని దండోరా ఉద్యమ అనుబంధ సంఘంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భీమన్న మాట్లాడుతూ 1950లో జరిగిన రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని రాజ్యాంగంలోని 14,15 ఆర్టికల్ ప్రతి వ్యక్తి తనకు నచ్చిన మతాన్ని స్వీకరించే హక్కు ఉంది. కావున ప్రతి దళిత క్రైస్తవునికి మత స్వేచ్ఛ కల్పించాలని అన్నారు. మరియు మాజీ సైనికులు ఏ రాములు మాట్లాడుతూ దళిత క్రైస్తవ హక్కులు సాధించేంత వరకు పోరాడుతామని, ఈ ఉద్యమంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సంఘాలను ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. మరియు కో కన్వీనర్ పులికల్ ప్రభాకర్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ బిజెపి తొత్తు అని సమాజంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని దళిత క్రైస్తవుల హక్కులకై పోరాడుతామని ముందుగా గళ మెత్తింది మందకృష్ణ మాదిగేనని, ఎక్కడ దళితులకు, దళిత క్రిస్టియన్లకు అన్యాయం జరిగిన అక్కడ ముందుంటానని చెప్పిన వ్యక్తి బిజెపికి తొత్తు ఎలా అవుతాడని దళితల గౌరవంకై పోరాడుతున్న వ్యక్తి అని అన్నారు. 13 మండలాలకు కూడా మండల ఇన్చార్జిలను ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రభాకర్ శాస్త్రి, జగదీష్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పూడూర్ చిన్నయ్య, ఆశన్న అద్వకేట్ విజయకుమార్,దండోరా రాజు, చిన్నపాడు ఆంజనేయులు,హనుమంతు, ఇమ్మానుయేలు, అలెగ్జాండర్,ధనుంజయ్, శేఖర్ బాబు,నాగరాజు, గోపాల్,దేవేంద్ర, బుచ్చన్న, ప్రశాంత్,మొదలగు వారు హాజరయ్యారు.



# 25 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు వినత పత్రాన్ని అందజేసిన రైతులు

**ఆలంపూర్ సెప్టెంబర్ 15(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఉండవెల్లి మండలంలోని చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు మారమునిగాల లేదా ప్రాగటూరు వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి 32వ కాలువకు అనుసంధానం చేయాలని రైతులు అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యే కి వినత పత్రాన్ని అందజేసిన రైతులు.అనంతరం రైతులు మాట్లాడుతూ సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందితే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి లిఫ్ట్ పథకానికి మంజూరు చేయించాలని ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడుని కోరారు, దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా సమస్య పరిష్కారం అయ్యేటట్లు చేస్తాననీ హామీ ఇచ్చారు



# మెరిట్ ప్రాతిపదికన ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి రాత పరీక్ష

## - ఈ నెల 16న గద్వాలలో పరీక్షలు..

## - అభ్యర్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి

**గద్వాల సెప్టెంబర్ 15(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

గద్వాల జిల్లా ఆసుపత్రి,మెడికల్ కళాశాలలో వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను ఔట్‌సోర్సింగ్ విధానంలో మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేసేందుకు ఈ నెల 16న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంలోని గంజిపేటలో ఉన్న శ్రీ సత్యసాయి డిగ్రీ,పీజీ కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ల్యాబ్ అటెండెంట్,రికార్డు అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మధ్యాహ్నం 1 గంట నుంచి 1:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు.ఆఫీస్ సబార్డినేట్,రేడియోగ్రాఫర్ టెక్నీషియన్,ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్,థియేటర్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మధ్యాహ్నం 3 గంటల నుంచి 3:30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. అనస్థీషియా టెక్నీషియన్,బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్,ఈసీజీ టెక్నీషియన్,డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సాయంత్రం 5 గంటల నుంచి 5:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకుని రిపోర్టు చేయాలని సూచించారు.దరఖాస్తు రసీదుపై పాస్‌పోర్టు సైజు ఫొటో అతికించుకుని రావాలని,తప్పనిసరిగా ఆధార్ కార్డును వెంట తీసుకురావాలని అధికారులు స్పష్టం చేశారు.

# శాంతినగర్ నుంచి జోగులాంబ హాల్ట్‌కు బస్సు నడపండి

**ఆలంపూర్ సెప్టెంబర్ 15(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

మండల కేంద్రమైన శాంతినగర్ నుంచి జోగులాంబ హాల్ట్ వరకు ఉదయం 4:45 గంటలకు ఒక బస్సు నడపాలని ప్రజలు గద్వాల డిపో మేనేజర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ రూట్‌కు కొన్ని నెలలుగా డిమాండ్ ఉందని, ఉదయం బస్సు వేస్తే శాంతినగర్ పరిసర ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని కోరుతున్నారు.ప్రస్తుతం చాలా మంది ఉదయం ఉండే హంద్రీ రైలుపై ఆధారపడి రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం, రాత్రి సరైన బస్సులు లేకపోవడంతో జోగులాంబ హాల్ట్‌కు చేరుకోవడానికి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇది డిమాండ్ ఉన్న రూట్ కాబట్టి హంద్రీ రైలు వచ్చే సమయానికి అనుగుణంగా ఉదయం, రాత్రి బస్సు సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా నిరుద్యోగ యువతకు ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు కోరుతున్నారు.




# రైతులే రంగంలోకి..

# బీమా కాలువకు జమ్ము విముక్తి!

## పదేళ్లుగా పేరుకుపోయిన జమ్ముతో సాగునీటికి ఆటంకం.. సొంత ఖర్చులతో తొలగింపు పనులు చేపట్టిన రైతులు

## శ్రీరంగాపూర్ రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయాలని మంత్రి జూపల్లిని కోరిన అన్నదాతలు

**వీపనగండ్ల, ప్రజా జ్యోతి రిపోర్టర్.**

సాగునీటి కాలువల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు ఇక తామే రంగంలోకి దిగారు. పదేళ్లుగా బీమా కాలువలో పేరుకుపోయిన జమ్మును తొలగించేందుకు మండల కేంద్రానికి చెందిన సుమారు 40 మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. తమ సొంత ఖర్చులతో యంత్రాలను ఏర్పాటు చేసుకుని కాలువలో జమ్ము తొలగింపు పనులు చేపట్టారు.





### పదేళ్లుగా పట్టించుకోని కాలువ

మండల కేంద్రంలోని బీమా కాలువలో గత పదేళ్లుగా జమ్ము పేరుకుపోయి సాగునీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలో జమ్ము అధికంగా పెరగడంతో నీరు సక్రమంగా ప్రవహించక పంటల సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కాలువ నిర్వహణపై అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో రైతులే తమ వంతుగా ముందుకు వచ్చి పనులు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

### రైతులే డబ్బులు సమకూర్చుకుని..

కాలువలో పేరుకుపోయిన జమ్మును తొలగించేందుకు గ్రామానికి చెందిన రైతులు తమలో తాము డబ్బులు సమకూర్చుకున్నారు. యంత్రాల సాయంతో బీమా కాలువలో జమ్ము తొలగింపు పనులను ప్రారంభించారు. సాగునీటి ప్రవాహం సక్రమంగా జరిగి పంటలకు నీరు అందాలనే ఉద్దేశంతో రైతులు ఈ పనులు చేపట్టడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

### రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయాలి

శ్రీరంగాపూర్ రిజర్వాయర్ నుంచి బీమా కాలువకు సాగునీరు విడుదల చేయాలని రైతులు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. కాలువలో జమ్ము తొలగింపు పనులు పూర్తయిన అనంతరం నీరు విడుదల చేస్తే వరి సాగు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు రైతుల ఇబ్బందుల దృష్టిలో ఉంచుకొని అధికారులు స్పందించి కాలువ నిర్వహణకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు ఈ కార్యక్రమంలో రైతులు జొల్లు పెద్దబాబు పెద్ద వెంకటరెడ్డి వెంకటేశ్వరరెడ్డి రామచందర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రాశస్త్‌పై పట్టణంలో నిర్లక్ష్యం

## - జిల్లాలో 1,417 మంది ఉపాధ్యాయులు ఇంకా పెండింగ్.!
## - ముసాపేటలో 100 శాతం పూర్తి..
## మహబూబ్‌నగర్ పట్టణంలో 67 శాతంతో అత్యల్ప పురోగతి

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 15 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పట్ల ఉపాధ్యాయుల్లో అవగాహన పెంపొందించేందుకు చేపట్టిన ప్రాశస్త్ అవగాహనా కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లాలో మిశ్రమ ఫలితాలు నమోదయ్యాయి. జిల్లాలోని 17 విద్యా మండలాలు, విభాగాల్లో మొత్తం 8,767 మంది ఉపాధ్యాయులకు గాను 7,350 మంది అన్ని అవగాహనా దృశ్యాలను వీక్షించగా.. 83.84 శాతం పూర్తి నమోదైంది. ఇంకా 1,417 మంది ఉపాధ్యాయులు అన్ని దృశ్యాలను పూర్తిచేయాల్సి ఉంది. అయితే మండలాల వారీగా పరిశీలిస్తే కొన్నిచోట్ల దాదాపు వంద శాతం సాధించగా.. మరికొన్ని ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడం విద్యాశాఖ అధికారుల దృష్టిని ఆకర్షిస్తోంది.

**ముసాపేటకు ప్రథమ స్థానం:**

ప్రాశస్త్ కార్యక్రమం పూర్తి చేయడంలో ముసాపేట మండలం 100 శాతంతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. మండలంలోని మొత్తం 177 మంది ఉపాధ్యాయులు అన్ని దృశ్యాలను వీక్షించారు. చిన్నచింతకుంట 99.6 శాతం, మిడ్జిల్ 99.5 శాతం, హన్వాడ 99.1 శాతం, రాజాపూర్ 98.9 శాతం సాధించి తరువాతి స్థానాల్లో నిలిచాయి. ఈ మండలాల్లో మిగిలి ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య కూడా చాలా తక్కువగా ఉండటంతో తక్షణ పర్యవేక్షణతో వంద శాతం సాధించే అవకాశం ఉంది. అలాగే మొహమ్మదాబాద్ 98 శాతం, అడ్డకల్ 97.9 శాతం, కోయిలకొండ 97.1 శాతం, గండీడ్ 96.3 శాతం నమోదు చేశాయి.

**90 శాతానికి పైగా.. కానీ వందకు దూరం:**


కొకుంట్ల 92.7 శాతం, నవాబ్‌పేట్ 91.6 శాతం, జడ్చర్ల 90.7 శాతం పూర్తి చేశాయి. జడ్చర్లలో 1,403 మంది ఉపాధ్యాయులు ఉండటంతో 90.7 శాతం సాధించినప్పటికీ 130 మంది ఇంకా అన్ని దృశ్యాలను వీక్షించాల్సి ఉంది. దీంతో కేవలం శాతాన్ని మాత్రమే కాకుండా మిగిలిన ఉపాధ్యాయుల సంఖ్యను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టమవుతోంది.

**8590 శాతం మధ్య ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి:**

భూత్పూర్‌లో 88.9 శాతం, దేవరకద్రలో 86.7 శాతం, మహబూబ్‌నగర్ గ్రామీణంలో 85.9 శాతం, బాలానగర్‌లో 85.9 శాతం నమోదైంది. భూత్పూర్‌లో 38 మంది, దేవరకద్రలో 61 మంది, మహబూబ్‌నగర్ గ్రామీణంలో 41 మంది, బాలానగర్‌లో 56 మంది ఉపాధ్యాయులు ఇంకా కార్యక్రమాన్ని పూర్తిచేయాల్సి ఉంది. ఈ మండలాల్లో మండల విద్యాధికారులు, విద్యా వనరుల సిబ్బంది, పర్యవేక్షణ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**పట్టణంలోనే 1,014 మంది పెండింగ్.!**

జిల్లా మొత్తం గణాంకాల్లో అత్యంత ఆందోళన కలిగిస్తున్న అంశం మహబూబ్‌నగర్ పట్టణ విద్యా మండలం పురోగతి. పట్టణ పరిధిలో మొత్తం 3,076 మంది ఉపాధ్యాయులకు గాను 2,062 మంది మాత్రమే అన్ని ప్రాశస్త్ దృశ్యాలను పూర్తిచేశారు. దీంతో 67 శాతం మాత్రమే పూర్తి నమోదైంది. ఇంకా 1,014 మంది ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని పూర్తిచేయాల్సి ఉంది. ముఖ్యంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న మొత్తం 1,417 మంది ఉపాధ్యాయుల్లో 1,014 మంది ఒక్క మహబూబ్‌నగర్ పట్టణ పరిధిలోనే ఉండటం గమనార్హం. అంటే జిల్లా మొత్తం పెండింగ్‌లో సుమారు 71.6 శాతం పట్టణ మండలానికే సంబంధించినదిగా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో మహబూబ్‌నగర్ పట్టణంపై విద్యాశాఖ అధికారులు అత్యవసర ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది.




**'పెండింగ్ లేని ఉపాధ్యాయులు' లక్ష్యంగా చర్యలు:**

ప్రతి పాఠశాలలో కార్యక్రమాన్ని పూర్తిచేయని ఉపాధ్యాయుల జాబితాను సిద్ధం చేసి, ప్రధానోపాధ్యాయులు వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని విద్యాశాఖ సూచిస్తోంది. విద్యా వనరుల సిబ్బంది, సమాచార నిర్వహణ సిబ్బంది, సమన్వయ అధికారులు పాఠశాలల వారీగా ప్రతిరోజూ పురోగతిని పరిశీలించాలి. విరామ సమయం లేదా బోధనేతర సమయాన్ని ఉపయోగించుకుని మిగిలిన ఉపాధ్యాయులతో అవగాహనా దృశ్యాలను వీక్షింపజేసి కార్యక్రమాన్ని పూర్తిచేయించేలా చర్యలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

**వీడియో వీక్షణకే పరిమితం కాకూడదు:**

ప్రాశస్త్ కార్యక్రమాన్ని కేవలం అవగాహనా దృశ్యాలను వీక్షించే కార్యక్రమంగా కాకుండా.. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించడం, వారి అవసరాలను అర్థం చేసుకోవడం, సమగ్ర విద్యను బలోపేతం చేయడం, పాఠశాలల్లో అందరికీ సమాన విద్యావకాశాలు కల్పించే వాతావరణాన్ని అభివృద్ధి చేయడం అనే విస్తృత లక్ష్యంతో అమలు చేయాల్సిన అవసరం ఉంది.జిల్లా స్థాయిలో ప్రస్తుతం 83.84 శాతం పూర్తి నమోదవగా.. తదుపరి లక్ష్యం 100 శాతంగా విద్యాశాఖ నిర్దేశించింది. "ప్రతి ఉపాధ్యాయుడు ప్రాశస్త్ అవగాహనా దృశ్యాలను వీక్షించాలి.. ప్రతి పాఠశాల సమగ్ర విద్యను ఆచరించాలి.. 100 శాతం పూర్తి సాధించాలి" అనే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగాల్సి ఉంది.

# నేడు చిన్నంబావి మండల సర్వసభ సమావేశం:ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్ గౌడ్

**చిన్నంబావి, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)**



చిన్నంబావి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సెప్టెంబర్ 16-09-2026 నాడు బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్‌గౌడ్ మంగళవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, సామర్థ్య నిర్మాణం తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.ప్రజాప్రతినిధులందరూ సంబంధిత అధికారులు, సిబ్బందితో కలిసి సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని పాత్రికేయులు కూడా సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

# పనిభారం తగ్గించాలి

## - కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా..

## - సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

**గద్వాల సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**

పనిభారం తగ్గించి,తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు.పెద్ద సంఖ్యలో కార్యకర్తలు నిరసనలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ,అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే అనేక బాధ్యతలు నిర్వహిస్తున్న తమపై అదనపు పనిభారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అదనపు పనులతో విధుల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.పనిభారం తగ్గించి విధులను సులభతరం చేయడంతో పాటు తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.తమ డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని,సమస్యలు పరిష్కరించే వరకు దశలవారీగా ఆందోళన కొనసాగిస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు.



# రేపల్లె ఘటనపై కలెక్టర్ కార్యాలయం ముట్టడికి ఎం ఆర్ పి ఎస్,ఎం ఎస్ పి పిలుపు

## - బాధిత కుటుంబానికి భరోసా కల్పించాలి..

## సర్పంచ్ సహా నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్ చేయాలి

**గద్వాల సెప్టెంబర్ 15(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం రేపల్లె గ్రామంలో అంతర్‌కుల వివాహం నేపథ్యంలో చోటుచేసుకున్న ఘటనపై జిల్లా ఎం ఆర్ పి ఎస్,ఎం ఎస్ పి బృందం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.బాధిత కుటుంబాన్ని జిల్లా కలెక్టర్,ఎస్పీలు స్వయంగా పరామర్శించి భరోసా కల్పించాలని, ఘటనకు సంబంధం ఉన్న వారందరిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 18న,జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించింది.రేపల్లె గ్రామాన్ని సందర్శించిన ఎం ఆర్ పి ఎస్,ఎం ఎస్ పి నాయకులు బాధిత కుటుంబ సభ్యులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన బిసి (బోయ) సామాజిక వర్గానికి చెందిన యువతి, ఎస్ సి(మాదిగ) సామాజిక వర్గానికి చెందిన యువకుడు ఇద్దరూ మేజర్లని,పరస్పర అంగీకారంతో వివాహం చేసుకున్నారని నాయకులు తెలిపారు.ఈ వివాహాన్ని వ్యతిరేకించిన యువతి కుటుంబ సభ్యులు,బంధువులు గ్రామ సర్పంచ్ అండతో యువకుడి కుటుంబానికి చెందిన ఇళ్లను ట్రాక్టర్లు,బొలెరో వాహనాలు,గడ్డపారలతో ధ్వంసం చేశారని వారు ఆరోపించారు.ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైనప్పటికీ గద్వాల జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకులు స్పందించకపోవడం బాధాకరమని ఎం ఆర్ పి ఎస్,ఎం ఎస్ పి నాయకులు పేర్కొన్నారు.ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి,ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి,ఎమ్మెల్యే విజయుడు,మాజీ ఎమ్మెల్యే ఎస్.ఏ.సంపత్‌కుమార్,సరితమ్మ తదితరులు ఘటనపై స్పందించాలని డిమాండ్ చేశారు.మాదిగల ఓట్ల కోసం మాత్రమే కాకుండా,వారి సమస్యలు,హక్కుల పరిరక్షణ కోసం కూడా ప్రజాప్రతినిధులు,వివిధ రాజకీయ పార్టీల్లోని మాదిగ నాయకులు గళం విప్పాలని వారు కోరారు.జాతికి అన్యాయం జరిగినప్పుడు రాజకీయాలకు అతీతంగా స్పందించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు.మాదిగల అస్తిత్వాన్ని రాజకీయ పార్టీలకు,నాయకులకు తాకట్టు పెట్టకుండా నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.రేపల్లె ఘటనలో కుట్రకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్రామ సర్పంచ్‌తో పాటు మరికొందరిని కేసులో చేర్చి,విచారణ అనంతరం చట్ట ప్రకారం రిమాండ్‌కు తరలించాలని ఎం ఆర్ పి ఎస్,ఎం ఎస్ పి డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ జాతీయ నాయకులు కొంకల భీమన్న మాదిగ, మస్తాన్,ఐజ రాజు,పోగుల రాజేష్,గద్వాల అశోక్,ఎల్కూర్ భాస్కర్,మోషే,విజయ్ కుమార్,హనుమంత్,కన్నా,పరుశరామ్,చిన్నపాడు ఆంజనేయులు,గువ్వలదిన్నె జంబయ్యతో పాటు ఎం ఆర్ పి ఎస్ జిల్లా సీనియర్ నాయకులు,ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.





# తెలంగాణ సాయుధ పోరాటంపై పేటెంట్ హక్కులు కమ్యూనిస్టులవే!

**- నాటి పోరాటాన్ని మతపోరాటంగా చిత్రీకరించడం చరిత్ర వక్రీకరణే - సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాల నరసింహ**




**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 15 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దొరల దోపిడీ, వెట్టిచాకిరీ, భూస్వామ్య పెత్తనానికి వ్యతిరేకంగా సాగిన మహత్తర ప్రజా ఉద్యమమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాల నరసింహ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ సాయుధ పోరాటంతో బీజేపీకి గానీ, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్‌కు గానీ ఎలాంటి సంబంధం లేదని బాల నరసింహ పేర్కొన్నారు. చరిత్ర లేని రాజకీయ పార్టీగా బీజేపీ, మహత్తరమైన రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తూ హిందూ ముస్లిం పోరాటంగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.

**మతపోరాటమైతే ముస్లిం నాయకులు ఎలా పాల్గొన్నారు?**

తెలంగాణ సాయుధ పోరాటం హిందూముస్లిం పోరాటమే అయితే నాటి పోరాటంలో బందగి, షోయబుల్లాఖాన్ వంటి ముస్లిం వ్యక్తుల పాత్రను ఎలా వివరిస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రజల పక్షాన నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మఖ్దూం మొహియుద్దీన్ వంటి నాయకుల పాత్రను బీజేపీ ఎలా వివరిస్తుందని ప్రశ్నించారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేపట్టిన సైనిక చర్యతోనే హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమై ఉంటే, అనంతరం నిజాంకు రాజ్ ప్రముఖ్ హోదా, గౌరవ వేతనం తదితర సౌకర్యాలు ఎందుకు కల్పించారో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ సమాజానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**‘భూమి కోసంభుక్తి కోసంవిముక్తి కోసం’**

నాటి నిజాం నిరంకుశ పాలనలో పేద రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొన్న దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ప్రజలను చైతన్యపరిచి, గ్రామ గ్రామాన రైతులను సంఘటితం చేసి పోరాటాలకు నాయకత్వం వహించిందని బాల నరసింహ అన్నారు. వెట్టిచాకిరీ, అక్రమ పన్నులు, భూముల ఆక్రమణలు, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా “భూమి కోసంభుక్తి కోసంవిముక్తి కోసం” సాగిన పోరాటంలో వేలాది మంది రైతులు, కూలీలు, మహిళలు పాల్గొన్నారని తెలిపారు. చాకలి ఐలమ్మ వంటి వీర మహిళలు దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడి ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. ఈ పోరాటంలో అనేక మంది కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు, రైతులు ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.

**పోరాట యోధుల కుటుంబాలను ఆదుకోవాలి**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న వారిని స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని గతంలో కేంద్రంలోని వాజ్‌పేయి ప్రభుత్వాన్ని కోరినా స్పందన రాలేదని బాల నరసింహ అన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధుల కుటుంబాలను గుర్తించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిందని ఆయన విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని అధికారికంగా నిర్వహించడంతో పాటు, దాని చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని బాల నరసింహ డిమాండ్ చేశారు. నాటి పోరాట చరిత్రను నేటి తరానికి తెలియజేయడంతో పాటు, ప్రస్తుత ప్రజా సమస్యలపై కూడా ప్రజలను ఐక్యం చేసి ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్, జిల్లా మాజీ కార్యదర్శి పరమేష్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు డి. రాము, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి. రాజు, మహిళా పట్టణ కార్యదర్శి ఇందిరా, జిల్లా కౌన్సిల్ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, మహేష్, ఖలీల్, ఆంజనేయులు, ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, లక్ష్మణ్, నాయకులు సుందర్ రాజ్, విఘ్నేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# చిన్నంబావి 108 అంబులెన్స్‌లో క్షేమంగా ప్రసవం



**చిన్నంబావి, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి)**

వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం పెద్దమారూర్ గ్రామానికి చెందిన అనురాధ (25)కు 108 అంబులెన్స్‌లోనే సిబ్బంది సురక్షితంగా ప్రసవం చేశారు. సోమవారం తెల్లవారుజామున అనురాధకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది పెద్దమారూర్ గ్రామానికి చేరుకుని అనురాధను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం అయ్యాయి.పరిస్థితిని గమనించిన ఈఎంటీ మేకల శ్రీధర్ సమయస్ఫూర్తితో అంబులెన్స్‌ను నిలిపి, పైలట్ రాఘవేంద్ర సహకారంతో వాహనంలోనే సురక్షితంగా ప్రసవం చేశారు. అనురాధ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.తల్లీబిడ్డలు ఇద్దరూ క్షేమంగా ఉండటంతో అనంతరం మెరుగైన వైద్యం కోసం వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆపత్కాలంలో సమయస్ఫూర్తితో స్పందించి సురక్షిత ప్రసవం చేసిన 108 సిబ్బందిని అనురాధ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్, వనపర్తి జిల్లా మేనేజర్ దుర్గాప్రసాద్ సిబ్బందిని అభినందించారు.

# కోయిలకొండలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

## సమస్యలపై అక్కడికక్కడే స్పందించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 15 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, సంక్షేమ వసతిగృహాలు, పాఠశాలల్లో ప్రజలకు అందుతున్న సేవల తీరును ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోయిలకొండ మండల కేంద్రంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎం.పి.డిఓ కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ), బీసీ బాలుర సంక్షేమ వసతిగృహం, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి సిబ్బంది హాజరు నుంచి ప్రజలకు అందుతున్న సేవల వరకు విస్తృతంగా పరిశీలించారు.

**పిటిషన్లపై ఆరా.. హాజరుపై ప్రత్యేక దృష్టి:**

ఎం.పి.డిఓ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు, దరఖాస్తుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల ఆన్‌లైన్ హాజరు, డైలీ సిట్యుయేషన్ రిపోర్ట్, ఫేస్ రికగ్నిషన్ ద్వారా నమోదవుతున్న హాజరు వివరాలను ఎం.పి.డిఓ లాగిన్‌లో పరిశీలించారు. బూరుగుపల్లి సర్పంచ్‌తో మాట్లాడిన కలెక్టర్ గ్రామంలో పెండింగ్ బిల్లులు, అభివృద్ధి పనులు, మంజూరైన నిధులు, నిధుల వినియోగంపై వివరాలు సేకరించారు. గ్రామీణ యాప్‌లో నమోదైన వివరాలు, వివిధ పథకాల అమలుపైనా ఆరా తీశారు. చెక్కులపై సంతకాల సమస్యను పరిష్కరించేందుకు ఉపసర్పంచ్‌ను పిలిపించి మాట్లాడాలని ఎం.పి.డిఓను ఆదేశించారు.

**ఇన్సులిన్ లేదని రోగుల ఫిర్యాదు.. వెంటనే స్పందించిన కలెక్టర్:**

కోయిలకొండ సీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్ ఆసుపత్రి రిజిస్టర్లు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు, వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులతో నేరుగా మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలు, మందుల లభ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కొందరు రోగులు ఐరన్ మాత్రలు, ఇన్సులిన్ ఇంజెక్షన్లు అందుబాటులో లేవని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేసి ఇన్సులిన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు స్పందించి ఇన్సులిన్‌ను తెప్పించి సంబంధిత రోగికి అందించారు. అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు స్టాక్‌ను నిరంతరం పర్యవేక్షించాలని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు.

**హాస్టల్‌లో ఆహారం, వసతులపై తనిఖీ:**

బీసీ బాలుర సంక్షేమ వసతిగృహాన్ని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, స్టోర్‌రూమ్, ఆహార సరుకుల నిల్వలను పరిశీలించారు. పప్పు తదితర సరుకుల నిల్వలను పరిశీలించి అవి విద్యార్థులకు సక్రమంగా అందుతున్నాయా అని సిబ్బందిని ప్రశ్నించారు. మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందుతున్న తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్న ఆమె.. నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు.

**పాఠశాలలో ఫ్యాన్ పనిచేయకపోవడంపై ఆగ్రహం:**

జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పాఠశాల పరిసరాలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహిస్తున్నారా? గతంలో ఎప్పుడు ఫాగింగ్ చేశారనే వివరాలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను తెలుసుకున్నారు. తరగతి గదిలో ఫ్యాన్ పనిచేయకపోవడాన్ని గమనించి వెంటనే మరమ్మతులు చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల పరిసరాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా చూడాలని, మురుగు కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తూ పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.





**విద్యార్థులకు మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు:**

పాఠశాల సమీపంలోని చిన్న దుకాణాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ విక్రయిస్తున్న వస్తువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన పదార్థాలు విక్రయించకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ సేవల నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు చేపట్టిన ఈ ఆకస్మిక తనిఖీల్లో సమస్యలను గుర్తించడమే కాకుండా, కొన్ని అంశాలపై అక్కడికక్కడే పరిష్కార చర్యలకు ఆదేశించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కోయిలకొండ ఎం.పి.డిఓ ధనుంజయరావు, మండల అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## చాగాపురంలో కరెంట్ కష్టాలను పరిష్కరించండి!

### - లైన్మెన్,విద్యుత్ స్తంభాలు,థర్డ్ వైర్ ఏర్పాటు చేయాలని ఎస్ఈకి వినతి

**ఇటిక్యాల (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 15: జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం**

చాగాపురం గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు విద్యుత్ శాఖ ఎస్ఈ అబ్దుల్ కరీం ని కలిసి వినతిపత్రం అందజేశారు.గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్న నేపథ్యంలో స్థానికంగా లైన్మెన్‌ను నియమించాలని, అవసరమైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని,థర్డ్ వైర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.గ్రామంలో విద్యుత్ సమస్యల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లగా, సమస్యలపై ఆయన స్పందించినట్లు గ్రామస్థులు తెలిపారు. ముఖ్యంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినసందర్భాల్లో వాటిని మరమ్మతుల కోసం తరలించేందుకు అయ్యే రవాణా చార్జీలను కూడా అందిస్తామని ఎస్ఈ అబ్దుల్ కరీం తెలిపినట్లు పేర్కొన్నారు.గ్రామంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించి,నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విద్యుత్ అధికారులను కోరారు.



# విద్యుత్ సమస్యలపై గద్వాలలో రైతుల నిరసన

- ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం:గొంగళ్ల రంజిత్‌కుమార్

- రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలి

**గద్వాల సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**

రైతులకు 24 గంటల ఉచిత,నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు నిరసన చేపట్టారు.గద్వాల అగ్రహారం సమీపంలోని విద్యుత్ ఉపకేంద్రం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం విద్యుత్ శాఖ ఎస్ఈకి వినతిపత్రం అందజేసి విద్యుత్ కోతలు,లోఓల్టేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ,రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు,లోఓల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని,దీంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని తెలిపారు.రాత్రివేళల్లో విద్యుత్ కోసం రైతులు పొలాల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.నిరంతరాయ విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల పంటల దిగుబడిపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు.రైతుల విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.రైతు బీమా ప్రీమియం చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని,పంట రుణమాఫీ విషయంలోనూ పలువురు రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం అందలేదని రంజిత్‌కుమార్ ఆరోపించారు.రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని కోరారు.గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిపై కూడా రంజిత్‌కుమార్ విమర్శలు చేశారు.పార్టీలు మారడంపై ఉన్న శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధి,ప్రజల సంక్షేమంపై లేదని ఆరోపించారు.నియోజకవర్గంలో అధికార పార్టీలో రెండు పవర్ సెంటర్లు ఉన్నప్పటికీ అభివృద్ధిలో ఆశించిన మార్పు కనిపించడం లేదన్నారు.అనేక గ్రామాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,గ్రామాలు చీకట్లలో ఉన్నా పాలకులు మాత్రం వెలుగుల్లో ఉన్నారని విమర్శించారు.ప్రజలు,రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.రైతుల మోటార్లు కాలిపోవడం,లోఓల్టేజీ,విద్యుత్ కోతలు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందించకపోతే రైతులు,ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని రంజిత్‌కుమార్ స్పష్టం చేశారు.కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బుచ్చిబాబు,రంగస్వామి,వెంకట్రాములు,విష్ణు, గోవిందు,బలరాం నాయుడు,రవి,సలీం,సుభాష్,లక్ష్మన్న,గోపాల్,మీసాల కిష్టన్న,చిన్న రాముడు,జమ్మన్న, విజయ్, భీమన్‌గౌడ్,దయాకర్,వెంకటేష్,అమ్రేష్,వాసు,నర్సింహా, సర్వేష్,రాము,మల్దకల్ ఆంజనేయులు తదితరులు,కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.








# జేపీఎన్‌సీఈలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు



**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 15 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జయప్రకాశ్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. కృష్ణమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల చైర్మన్ కె.ఎస్. రవికుమార్ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కె.ఎస్. రవికుమార్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్రను విశ్వేశ్వరయ్య తన సేవల ద్వారా చాటిచెప్పారని అన్నారు. క్రమశిక్షణ, కృషి, నిబద్ధత, నిజాయితీతో పనిచేసిన ఆయన నేటి ఇంజనీర్లు, విద్యార్థులకు ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. విద్యార్థులు ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని సాంకేతిక నైపుణ్యాలతో పాటు సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు.1915లో బ్రిటిష్ ప్రభుత్వం నుంచి 'నైట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్' గౌరవాన్ని పొందిన విశ్వేశ్వరయ్యకు, దేశానికి చేసిన అపారమైన సేవలకు గుర్తింపుగా 1955లో భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారంతో సత్కరించింది. ఆయన జన్మదినమైన సెప్టెంబర్ 15ను దేశవ్యాప్తంగా ఇంజనీర్స్ డేగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. పి. కృష్ణమూర్తి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డా. వి.ఈ. చంద్రశేఖర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని విశ్వేశ్వరయ్యకు ఘన నివాళులర్పించారు.

# నర్వలో వినాయకుల ప్రతిష్టాపనలు ప్రత్యేక పూజలు పాల్గొన్న నాయకులు

**నర్వ సెప్టెంబర్ 15 ప్రజా జ్యోతి**

వినాయక చవితి సందర్భంగా నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం రామాలయం వద్ద ఆర్యన్ గ్రూప్ యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో సోలాపూర్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన భారీ వినాయక విగ్రహాన్ని, క్ ప్రత్యేక పూజలతో ప్రతిష్టాపనలు చేశారు, ఈ పూజా కార్యక్రమంలో దండుదయ్యప్ప అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు సరస తీ యమని పూజలో పాల్గొన్నారు, ఇదేవిధంగా అన్నదానము చేశారు, మొదటి రోజు అన్నదాన కర్త కట్ట అడివి చిన్న నరసింహులు, ఇదేవిధంగా మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కర్రెమ్మ గుడి వినాయక్, తిలక్ నగర్ లో వినాయక్, గొల్ల గిరిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో, వాల్మీకి దేవాలయం వద్ద, శ్రీ వెంకటేశ్వర దేవాలయం వద్ద, దేవాలయం వద్ద , ఇదేవిధంగా ఆయా వాడల్లో రాత్రి 11 గంటల వరకు వినాయకులను ప్రత్యేక పూజలతో ప్రతిష్టాపదాలు చేశారు, ప్రత్యేక పూజలతో మండపాల్లో గణేశుల విగ్రహాలను ప్రతిష్టాపన ఈచేశారు, ఈ పూజ కార్యక్రమాలలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు నాయకులు తదితరులు పాల్గొన్నారు., ఇదే విధంగా మండలంలోని ఆయా గ్రామాలలో గణేష్ చవితి సందర్భంగా గ్రామ గ్రామాల్లోని ప్రధాన వీధులలో గణేష్ మండపాలన ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలతో ప్రతిష్టాపన చేశారు, ఈ పూజా కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెటింగ్ వైస్ చైర్మన్ డి కృష్ణ రెడ్డి, శరణప్ప, గడ్డం నరసింహ. గొల్ల మల్లేష్. ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు,



# పండగల సాయన్న విగ్రహ ఏర్పాటుకై ఎమ్మెల్సీకి దామోదర్ రెడ్డి కి వినతి

**నాగర్ కర్నూల్ : 15 సెప్టెంబర్ (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహం ఏర్పాటుకు అనుమతి,స్థలం ఏర్పాటును చేయాలని శాసన మండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్ రెడ్డికి నాగర్ కర్నూల్ మత్స్య పారిశ్రా మిక సహకార సంఘం జిల్లా అధ్యక్షులు వాకిటి ఆంజనేయులు ఆధ్వర్యంలో వినతి పత్రం అంద జేశారు.కార్యక్రమంలో కేసరి సముద్రం అధ్యక్షులు జిల్లా డైరెక్టర్ తెప్ప బాబు,ఉపాధ్యక్షులు గువ్వల వెంకటయ్య,కార్యదర్శి చాపల వెంకటయ్య,డైరెక్టర్ జంగయ్య,ఉమ్మడి జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి తవిటి నిరంజన్,కాంగ్రెస్ యువ నాయకుడు తెప్ప రుద్రయ్య, పులమోని పర్వతాలు,సోప్పరి యాదయ్య,కొండమోని సైదయ్య,కొండ మోని రాజు,తెప్పరవి,తెప్ప రాజేందర్, కొండమోని రాజేష్,డొకూరి నారాయణ,తదితరులు పాల్గొన్నారు.



# మహబూబ్‌నగర్ ఫస్ట్‌లో ఘనంగా వినాయక పూజలు

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 15 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో ప్రతిష్ఠించిన శ్రీ మహాగణపతికి రెండో రోజు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ ఆధ్వర్యంలో సంతోష్ ఆచార్య మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది, నాయకులు, శిక్షణ కేంద్రం ఉద్యోగులు, విద్యార్థులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. విఘ్నేశ్వరుడి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గుండా మనోహర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గణపతి మండపం ప్రాంగణంలో మహబూబ్‌నగర్ ఫస్ట్‌లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ప్రత్యేక కళారూపాల ద్వారా ప్రదర్శించడం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అనిల్, వందేమాతరం ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, నిజలింగప్పతో పాటు మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రం ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు కంటి పరీక్షలు.. అద్దాల పంపిణీ

## - జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో కంటి పరీక్షలు నిర్వహించాలి : డీఎంహెచ్ఓ డా. శ్రీనివాసులు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 15 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

విద్యార్థుల్లో కంటి సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ నగరంలోని కేజీబీవీ అర్బన్ (ఏనుగొండ)లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు కంటి పరీక్షల కార్యక్రమాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు యాక్షన్ ప్లాన్ ప్రకారం కంటి పరీక్షలు నిర్వహించాలని సంబంధిత వైద్య సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల్లో కంటి సమస్యలను తొలిదశలోనే గుర్తించి, అవసరమైన చికిత్స, తదుపరి వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గతంలో నిర్వహించిన కంటి పరీక్షల్లో కంటి చూపు సమస్యలు గుర్తించిన విద్యార్థినులకు ఈ సందర్భంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి డా. సునీత, కేజీబీవీ ప్రిన్సిపాల్ నర్సమ్మ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. శశికాంత్, డా. పులి విద్య, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డా. ప్రవీణ్, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, డీఈఐసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజాజ్యోతి
బుధవారం సెప్టెంబర్ 16, 2026

# ఘనంగా కొనసాగుతున్న గణేష్ ఉత్సవాలు

## - ప్రభుత్వ ఆసుపత్రిలో గణపతి పూజలు

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో గణేష్ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.పట్టణంలోని రాఘ వేంద్ర కాలనీ రోడ్ నెంబర్ 1 లో వినాయక చవితి సందర్భంగా బజరంగ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి గణపతి మహాస్వామికి విశేషంగా వేదమంత్రోచ్చరణాల మధ్య పూజా కార్యక్రమాన్ని అర్చకులు గోమటం మురళీమోహన్ ఆచార్యులు నిర్వహించారు.కాలనీవాసులు పద్మారావు,శ్రీనివాసులు,శివకుమార్ దంపతులచే శాస్త్రోక్తంగా పూజకార్యక్రమాలు నిర్వహించిన అనంతరం స్వామివారికి నివేదించిన ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో బజరంగ్ యూత్ అధ్యక్షులు సందీప్ కుమార్,యూత్ సభ్యులు ప్రశాంత్, జ్ఞానేశ్వర్,ప్రవీణ్,నిఖిల్, అఖిల్, నాగరాజ్ కార్తీక్,భరత్, క్రాంతి,సింహాద్రి,కమల్ కుమార్,కాలనీవాసులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**-ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో గణపతి పూజలు:--**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధార ణ ఆసుపత్రిలో వినాయక చవితిని పురస్కరించు కుని వైద్యులు,సిబ్బంది గణపతికి ఆకుతోట రోహిత్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వైద్యసాహాయానికి ఆసుపత్రికి వచ్చిన ప్రతి రోగికి విఘ్నాలు కలగకుండా వైద్యులు,నర్సింగ్ సిబ్బంది ఇతర సిబ్బంది ఆరోగ్య సేవలు అందించి త్వరగా కోలుకొని ఇంటికి త్వరగా చేరుకొనెలా కనికరించా లని స్వామివారిని కోరారు.అనంతరం రోగి సహా యకులకు, పాల్గొన్న సిబ్బందికి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో హెడ్ నర్స్,నర్సింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# ఇంజనీర్‌గా తన సాంకేతిక అనుభవాన్ని ప్రజా సేవతో మేళవించి న అల వెంకటేశ్వర రెడ్డి

## - ఇంజనీర్స్ డే సందర్భంగా ఆల వెంకటేశ్వర్ రెడ్డికి ఘన సన్మానం

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 15 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఇంజనీర్స్ డే సందర్భంగా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఇంజనీర్‌గా తన సాంకేతిక అనుభవాన్ని ప్రజా సేవతో మేళవించి, ముఖ్యంగా దేవరకద్ర నియోజకవర్గంలో సాగునీటి రంగ అభివృద్ధికి చేసిన కృషిని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. కేసీఆర్ హయాంలో పదేళ్ల పాటు దేవరకద్ర ఎమ్మెల్యేగా పనిచేసిన ఆల వెంకటేశ్వర్ రెడ్డి.. రైతుల ప్రయోజనాల కోసం పలు సాగునీటి ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌లు, కాలువల అభివృద్ధికి కృషి చేశారని నాయకులు పేర్కొన్నారు.

**సాగునీటి రంగంలో ప్రత్యేక కృషి:**

కరివెన ప్రాజెక్టు సాధనలో కీలక పాత్ర పోషించి, ప్రాజెక్టు రూపకల్పనకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వివరించి మంజూరులో కృషి చేశారని తెలిపారు. నియోజకవర్గంలో 30 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం ద్వారా ఆయకట్టు విస్తరణకు కృషి చేశారని, ఘనపురం కెనాల్‌కు రూ.110 కోట్ల మంజూరు కోసం కృషి చేసి కందూరు పెద్దవాగును సజీవంగా ఉంచడంతో పాటు కృష్ణా జలాలను సరళాసాగర్ వరకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. అలాగే కొమ్మిరెడ్డిపల్లి చెక్‌డ్యామ్‌కు తూము ఏర్పాటు చేసి గొలుసుకట్టు ద్వారా కొమ్మిరెడ్డిపల్లి, పొన్నకల్, దుబ్బపల్లి, రాచాల గ్రామాల చెరువులకు సాగునీరు అందించే ఆలోచనకు శ్రీకారం చుట్టారని తెలిపారు. కోయిల్‌సాగర్ నుంచి గ్రావిటీ ద్వారా 11 గ్రామాల రైతులకు సాగునీరు అందించేలా కృషి చేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ సహకారంతో దాదాపు 70 వేల ఎకరాల అదనపు ఆయకట్టు సృష్టించేందుకు కృషి చేశారని నాయకులు వివరించారు.

**ఇంజనీర్ ఆలోచన.. ఎమ్మెల్యేగా ఆచరణ:**

ఇవి కేవలం ప్రభుత్వ సాధారణ అభివృద్ధి కార్యక్రమాలు మాత్రమే కాకుండా.. ఒక ఇంజనీర్‌గా తనకున్న సాంకేతిక పరిజ్ఞానం, అనుభవంతో రైతుల అవసరాలను గుర్తించి, వాటిని ఎమ్మెల్యేగా ఆచరణలో పెట్టేందుకు ఆల వెంకటేశ్వర్ రెడ్డి చేసిన ప్రయత్నాలని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. "రైతు సంక్షేమం కోసం ఇంజనీర్‌గా ఆలోచించి.. ఎమ్మెల్యేగా ఆచరణలో పెట్టిన ఆల వెంకటేశ్వర్ రెడ్డికి ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు" అంటూ నాయకులు అభినందనలు తెలిపారు.



# సర్పంచుల చెక్ పవర్ నిషేధం

## - ఎత్తం సర్పంచ్, ఉప సర్పంచ్ సస్పెన్షన్

## - జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

జిల్లాలో నిబంధనల ఉల్లంఘన, అధికార దుర్వినియోగం, ప్రభుత్వ నిధుల వినియోగంలో అవకతవకలకు సంబంధించి పలువురు ప్రజాప్రతినిధులపై జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. కొల్లాపూర్, పెంట్లవెల్లి, బిజినపల్లి మండలాల పరిధిలోని మూడు గ్రామాల సర్పంచుల చెక్ పవర్‌ను నిషేధిస్తూ, కోడేరు మండలం ఎత్తం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి, పెంట్లవెల్లి మండలం పెంట్లవెల్లి, బిజినపల్లి మండలం కారుకొండ గ్రామాల సర్పంచులు గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేసినట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా తమకు అప్పగించిన అధికారాలను దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణకు రావడంతో ఆయా గ్రామాల సర్పంచుల చెక్ పవర్‌ను నిషేధిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు తెలిపారు. కోడేరు మండలం ఎత్తం గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగంకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారు సమర్పించిన వివరణలను అధికారులు పరిశీలించిన అనంతరం, నిబంధనలకు విరుద్ధంగా..వ్యవహరించినట్లు గుర్తించి ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు వెల్లడించారు. గ్రామపంచాయతీలకు ప్రభుత్వం కేటాయించే నిధులను నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలని జిల్లా పంచాయతీ అధికారి సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు తమకు అప్పగించిన బాధ్యతలను నిబంధనల మేరకు నిర్వర్తించాలని, ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# పీఎం శ్రీ పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## - నిధులను నిబంధనల ప్రకారం సద్వినియోగం చేయాలి

## - ఆర్జేడీ ఎం. సోమిరెడ్డి,- పాఠశాలల అభివృద్ధిపై ఆర్జేడీ సోమిరెడ్డి సమీక్ష





**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

తాడూర్ మండల పరిధిలోని మేడిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం రాష్ట్ర ప్రాంతీయ విద్యా సంచాలకులు ఆర్జెడి ఎం. సోమిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పీఎం శ్రీ పథకం కింద కేటాయించిన నిధుల వినియోగం, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను పరిశీలించి, వివిధ అంశాలపై పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, బడి తోట, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, కాంపౌండ్ వాల్, సి డబ్ల్యూ ఎస్ ఎన్ విద్యార్థుల కోసం నిర్మించిన ర్యాంపులు తదితర సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో నిర్వహించిన హిందీ దివస్ సందర్భంగా విద్యార్థుల రాస్తున్న ప్రశ్నావళిని కూడా పరిశీలించిన ఆర్జేడీ, విద్యార్థులు రూపొందించిన శబ్దావళి, చిత్రలేఖనాలను పరిశీలించి విద్యార్థులకు తగిన సూచనలు చేశారు. మేడిపూర్ పాఠశాల సందర్శన అనంతరం నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని సందర్శించి, ఆర్జేడీ ఎం. సోమిరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్‌తో కలిసి జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

మేడిపూర్ పాఠశాలలో పరిశీలించిన అంశాల నేపథ్యంలో జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల్లో నిధుల వినియోగం, పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, విద్యా ప్రమాణాల మెరుగుదల తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్జేడీ ఎం. సోమిరెడ్డి మాట్లాడుతూ.. పీఎం శ్రీ పాఠశాలలను ఆదర్శవంతమైన విద్యా సంస్థలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అందిస్తున్న నిధులను నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో సద్వినియోగం చేయాలని ఆయన సూచించారు. నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలన్నారు.పాఠశాలల్లో విద్యార్థులకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించడంతో పాటు బడి తోటలు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, క్రీడా సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సి డబ్ల్యూ ఎస్ ఎన్ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ, ప్రతి విద్యార్థికి సమానమైన విద్యా అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.విద్యార్థుల్లో సృజనాత్మకత, భాషా నైపుణ్యాలు, విద్యా సామర్థ్యాలను పెంపొందించేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. ౹ాపీ శ్రీ పాఠశాలల లక్ష్యాలను సాధించే దిశగా అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, నూరుద్దీన్ , పి ఎం శ్రీ పాఠశాలలను ప ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటల విద్యుత్ ఇవ్వాల్సిందే.. లేదంటే బంద్‌కు పిలుపు

## సల్కర్‌పేట్ సబ్‌స్టేషన్ ఎదుట భారీ నిరసన.. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి




**గండీడ్ (ప్రజా జ్యోతి):**

రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ పరిగి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత కొప్పుల మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గండీడ్ మండలం సల్కర్‌పేట్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ కోతలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందేదని, ప్రస్తుతం తరచూ విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహేష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పంటలకు సకాలంలో నీరు అందక రైతులు నష్టపోతున్నారని తెలిపారు."కాంగ్రెస్‌కు ఓటు వేసి కరెంటు కష్టాలు కొనితెచ్చుకున్నాం" అంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. 24 గంటల విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, కనీసం వ్యవసాయానికి అవసరమైన సమయంలో కూడా నిరంతర విద్యుత్ సరఫరా చేయలేకపోతోందని విమర్శించారు.ప్రభుత్వ పాలనలో సమన్వయ లోపం, నిర్ణయాల్లో గందరగోళం కారణంగానే విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని మహేష్‌రెడ్డి ఆరోపించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోతే గండీడ్, మహమ్మదాబాద్ మండలాల బంద్‌కు పిలుపునిస్తామని కొప్పుల మహేష్‌రెడ్డి హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# ఈ నెల 17 న, కలెక్టరేట్లో ప్రజా పాలన దినోత్సవం



## -ప్రజాపాలన దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## -అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య,దేవ సహాయం

**నాగర్ కర్నూల్ : 15 సెప్టెంబర్ (ప్రజా జ్యోతి)**

సెప్టెంబర్ 17న,జరుపబోయే ప్రజాపాలన దినోత్సవం ఏర్పాట్లపై జిల్లా అధికారులకు తమ శాఖలకు సంబంధించిన పనులను జిల్లా అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య (రెవెన్యూ) దేవ సహాయం (లోకల్ బాడీస్) జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు,జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోనిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని,ఈ కార్యక్రమంలో జాతీయ జెండా ఆవిష్కరణ ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలన్నారు.జాతీయ పతాకం ఏర్పాటు, సభా వేదిక అలంకరణ,ప్రొటోకాల్ ప్రకారం వీ.ఐ.పీ లు,ప్రజా ప్రతినిధులు,ప్రజలు,విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు,షామియానాలు,కుర్చీలు,బ్యారికేడ్లు, తాగునీటి వసతి ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించాలని,సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ,ఆహ్వాన పత్రికల పంపిణీ వంటి అంశాల్లోనూ ఎలాంటి లోటుపాట్లు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని,ముఖ్య అతిథి సందేశం తదితర కార్యక్రమాలకు సంబంధించి అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ప్రజాపాలన దినోత్సవ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని,శాఖలకు అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని,ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో డి.ర్. ఓ పాండు,కలెక్టరేట్ ఏ.వో చంద్రశేఖర్,వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## చిరుత దాడిలో రెండు ఆవులు మృతి

## పెద్దవార్వాల్‌లో ఘటన.. భయాందోళనలో రైతులు

**గండీడ్(ప్రజా జ్యోతి)**

చిరుత దాడిలో రెండు ఆవులు మృతి చెందిన ఘటన గండీడ్ మండలం పెద్దవార్వాల్ గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శివుని బాలయ్య తన ఆవులను పొలం వద్ద కట్టేసి సాయంత్రం ఇంటికి వచ్చారు.రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో పశువులు పెద్దగా అరుస్తుండటాన్ని గమనించిన సాలార్‌నగర్ గ్రామస్తులు బాలయ్యకు సమాచారం అందించారు. దీంతో బాలయ్యతో పాటు పలువురు రైతులు పశువులు ఉన్న ప్రాంతానికి వెళ్లారు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో అక్కడికి చేరుకోగా రెండు ఆవులు అప్పటికే మృతి చెంది కనిపించాయి.పశువులపై చిరుత దాడి చేయడంతోనే అవి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనతో బాధిత కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. గండీడ్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో చిరుతల సంచారం, పశువులపై దాడులు తరచూ జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.గతంలోనూ ఈ ప్రాంతంలో చిరుతల దాడులకు సంబంధించి సుమారు 10 నుంచి 15 పశువులు మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు తెలిపారు. మనుషుల ప్రాణాలకు నష్టం వాటిల్లితేనే అధికారులు స్పందిస్తారా? అంటూ ఆందోళన వ్యక్తం చేశారు.చిరుతల సంచారంతో పొలాల వద్ద పశువులను కట్టివేయాలంటేనే రైతులు భయాందోళనకు గురవుతున్నారని, అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి చిరుతల సంచారాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



## రోడ్డు భద్రత,సైబర్ నేరాలు,డ్రగ్స్, పోక్సో చట్టంపై పోలీస్ కళాబృందం అవగాహన

## - ప్రజల అవగాహనతోనే నేరాల నివారణ

**గద్వాల సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**

అవగాహనతో అప్రమత్తంగా ఉండటమే నేరాల నివారణకు తొలి అడుగు అని పోలీసులు సూచించారు.జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీస్ కళాబృందం ధరూర్ మండలం రేవులపల్లి గ్రామంలో రోడ్డు భద్రత,సైబర్ నేరాలు,డ్రగ్స్ దుష్ప్రభావాలు,పోక్సో చట్టం,సీసీ కెమెరాల ప్రాధాన్యత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించింది.ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,హెల్మెట్ స్ట్రాప్‌ను సరిగా బిగించుకోవాలని సూచించారు.వేగాన్ని నియంత్రించడంతో పాటు రహదారి నిబంధనలు పాటించాలని,మైనర్లు వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112కు సమాచారం అందించాలని,సమాచారం అందిన వెంటనే సమీపంలోని బ్లూకోల్ట్స్ సిబ్బంది స్పందిస్తారని తెలిపారు.బాలలు,బాలికలపై జరిగే లైంగిక నేరాలకు పోక్సో చట్టం ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని వివరించారు. మహిళలు,బాలికలను ఎవరైనా వేధించినా,ఇబ్బందులకు గురిచేసినా షీ టీమ్ నంబర్ 8712670312కు సమాచారం ఇవ్వాలని సూచించారు.సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని,బ్యాంకు ఖాతా వివరాలు,ఓటీపీ,పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు.డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజలు తమ పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసులు కోరారు.ఈ కార్యక్రమంలో ధరూర్ హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్,కళాబృందం సభ్యులు రాధమ్మ,రామాంజనేయులు,షీ టీమ్ సభ్యులు లోకేశ్వరి,పోలీస్ స్టేషన్ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# పేదరికం అడ్డుకాలేదు.. డాక్టర్ సీటు ఆపలేదు!

గూడెం గ్రామానికి గర్వకారణం.. సలీమాకు ఎంబీబీఎస్ సీటు

నిరుపేద కుటుంబం నుంచి ఎంబీబీఎస్ సీటు..

ప్రభుత్వ పాఠశాలలో చదివి ఘన విజయం

**చిన్నంబావి, సెప్టెంబర్ 15(ప్రజా జ్యోతి)**



కృష్ణానదిలో చేపలు పట్టి కుటుంబాన్ని పోషించే తండ్రి.. ప్రభుత్వ పాఠశాలలో చదివిన కూతురు.. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఎంబీబీఎస్ సీటు సాధించింది. చిన్నంబావి మండలం గూడెం గ్రామానికి చెందిన పింజరి పెద్ద కాసిం కుమార్తె సలీమా తాజాగా జరిగిన ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో హైదరాబాద్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించి తన తల్లిదండ్రులతో పాటు గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం నుంచి వచ్చిన సలీమా.. తల్లిదండ్రుల కష్టాలను కళ్లారా చూస్తూ చదువుపై దృష్టి సారించింది. ప్రభుత్వ పాఠశాలలో చదివి, పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి వైద్య విద్యలో సీటు సాధించింది. సలీమాకు ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు రావడంతో కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. గ్రామస్తులు మిఠాయిలు తినిపించి ఘనంగా అభినందించారు.

### తల్లిదండ్రుల కష్టమే స్ఫూర్తి

సలీమా మాట్లాడుతూ.. తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపింది. తల్లిదండ్రులు కృష్ణానదిలో చేపలు పట్టి కుటుంబాన్ని పోషించేవారని, వారి కష్టాలను చూసి తాను జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదలతో చదివానని చెప్పింది. ఎంబీబీఎస్ సీటు సాధించి తల్లిదండ్రులు గర్వపడేలా చేయడం తనకు ఎంతో ఆనందంగా ఉందని భావోద్వేగానికి గురైంది.

### 'నా కూతురు నాకు గర్వకారణం'

సలీమా తండ్రి పెద్ద కాసిం మాట్లాడుతూ.. చేపలు పట్టడమే తమ కుటుంబానికి జీవనాధారమని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చదివించి ఉన్నత విద్య అందించేందుకు కష్టపడ్డానన్నారు. తన కూతురు ఎంబీబీఎస్ సీటు సాధించడం తన జీవితంలో మరచిపోలేని ఘట్టమని ఆనందభాష్పాలతో తెలిపారు.

### గ్రామానికి ఆదర్శంగా సలీమా

నిరుపేద కుటుంబం నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన సలీమాను గ్రామ పెద్దలు, యువత అభినందించారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని గ్రామంలోని విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# గణనాథులను దర్శించుకున్న బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు

**ఆలంపూర్ సెప్టెంబర్ 15(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండలం పెద్దపల్లి, బూడిదపాడు గ్రామాలలో గజనన మహోత్సవం సందర్భంగా ప్రతిష్టించిన గణనాథుడిలకి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించి, స్వామి వారి ఆశీస్సులను పొందారు.అనంతరం,కమిటీ సభ్యులు వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని,ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గణనాథుడిని ప్రార్థించారు.. అదేవిధంగా ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు.పూర్వ వైభోగం తీసుకొచ్చే విధంగా, కృషి చేయాలి సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించాలి అందరూ కలిసికట్టుగా వేడుకలు జరుపుకోవాలని కోరారు...వచ్చే ఏడాది ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్టించాలి. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుని పూజించాలి పర్యావరణాన్ని కాపాడాలి అని తెలిపారు. గద్వాల నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు లక్ష్మీకాంత్ రెడ్డి,డి.శేఖర్ నాయుడు,చక్రిధర్ రెడ్డి,సోమశేఖర్ రెడ్డి,శ్రీరాములు,రామ్మోహన్ యాదవ్,అంజి,రాము,అరవిందు,నరసింహులు, గోవిందు, అంజి, వెంకటేష్,నరసింహులు,తిమ్మప్ప,మరియు నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు....



# హజ్ యాత్రికులకు మెడికల్ స్క్రీనింగ్ టెస్ట్ లు తప్పనిసరి



- జిల్లా వైద్యాధికారి ద్వారా టెస్టులు చేయించుకోవాలి - ఈ నెల 17న,ఆహారం తీసుకోకుండా జిల్లా ఆసుపత్రికి రావాలి - జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేఖ్ ఫరీద్ అహ్మద్

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి)**

హజ్ యాత్ర 2027 సంవత్సరానికి ఎంపికైన యాత్రికులు ఈనెల 17వ, తేదీన నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా జనరల్ ఆసుపత్రిలో నిర్వహించే వైద్య శిబిరాన్ని హజ్ యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేఖ్ ఫరీద్ అహ్మద్ అన్నారు.జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ద్వారా హజ్ యాత్రికుల కోసం ప్రత్యేకంగా ఒక ప్రొసీడింగ్ జారీ చేయడం జరిగిందన్నారు.కచ్చితంగా ప్రభుత్వం జారీ చేసిన జీవోలో సూచించిన మేరకు జిల్లా మెడికల్ అధికారి పర్యవేక్షణలో జరిగే అన్ని రకాల మెడికల్ టెస్టులు మాత్రమే హజ్ యాత్రకు చెల్లుబాటు అవుతాయని,ప్రైవేట్లో వైద్య పరీక్షలు చేయించుకుంటే చెల్లవని ప్రభుత్వం జారీ చేసిన ప్రొసీడింగ్ ప్రకారం సెప్టెంబర్ 17 న ఉదయం 07గంటలకు జిల్లా ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని,వైద్యపరీక్షలకు వచ్చే హజ్ యాత్రికులు పరి గడుపున ఎలాంటి ఆహారం తీసుకోకుండా రావాలని,ఆహారం తీసుకోనే ముందు కొన్ని వైద్య పరీక్షలు చేయించాల్సి ఉంటుందని ఇందుకోసం నాగర్ కర్నూల్ జిల్లా ఇన్చార్జి గా హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్ ను ప్రభుత్వం నియమించిందన్నారు.ఈ శిబిరంలో సి.బి.సి,ఎఫ్బి ఎస్/హెచ్ బీ ఎ 1సి,చెస్ట్ ఎక్స్ రే,కె.ఎఫ్.టి,ఎల్ ఎఫ్ టి,ఈసీజీ వంటి 7 పరీక్షలను నిర్వహిస్తారని,ఈ శిబిరంలో చేయించుకున్న వైద్య పరీక్షలే హజ్ యాత్రకు వెళ్లే సమయంలో చెల్లుబాటవుతాయని, నాగర్ కర్నూల్,అచ్చంపేట,కల్వకుర్తి,కొల్లాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన హజ్ యాత్రికులు ఈ శిబిరంలో కచ్చితంగా హాజరుకావాలని వైద్య శిబిరానికి వచ్చేటప్పుడు కచ్చితంగా హజ్ అప్లికేషన్ హార్డ్ కాపీ,మొదటికిస్తు చెల్లించిన డబ్బు రసీదు, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు,ఫోటో వెనకాల బ్యాక్ గ్రౌండ్ వైట్ గా ఉండాలని, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని కచ్చితంగా వెంట తెచ్చుకోవాలని,వైద్య పరీక్షలకు వచ్చే సమయంలో ఒక హజ్ యాత్రికుడి వెంట సహాయకులుగా ఒకరు మాత్రమే రావాలని నాగర్ కర్నూల్ జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగే వైద్య శిబిరంలో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లా జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపర్డెంట్ పర్యవేక్షణలో ఈ వైద్య పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లను,వైద్య పరీక్షలకు సంబంధించిన సర్టిఫికెట్లు జారీ చేయడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో సొసైటీ కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం,ఉపాధ్యక్షుడు అబ్దుల్ హాక్, మహమ్మద్ ముస్తాఖ్ అహ్మద్,సహాయ కార్యదర్శి మహబూబ్ అలీ,సహాయ కార్యదర్శి మహమ్మద్‌షూకూర్,ట్రెజరర్ మౌలా పిరా,సభ్యులు సయ్యద్ తాహెర్,మహమ్మద్ పాషా,మహమ్మద్ ఏజాజ్,మహమ్మద్ సలీం,మహమ్మద్ నియామతుల్లా షరీఫ్, ప్రచార కార్యదర్శి నూరుల్ హాక్ పాల్గొన్నారు.